

6న లోకేశ్.. 9న చంద్రబాబు రాక

విజయనగరం రూరల్, మే 3: టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఉత్తరాంధ్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాకు వస్తున్నారు. ఈనెల 9న సాయంత్రం చీపురుపల్లిలో చంద్రబాబు ప్రజాగళం సభ జరుగనుంది. 6న విజయనగరం వస్తున్న లోకేశ్ పర్యటనకు సంబంధించి ఎన్నికల సభ ఎక్కడనేది స్పష్టత రాలేదు. ప్రాథమిక సమాచారం మాత్రమే పార్టీ జిల్లా కార్యాలయానికి శుక్రవారం అందింది. టీడీపీ రాష్ట్ర కార్యాలయం నుంచి శనివారం పూర్తి సమాచారం వచ్చాక ఏర్పాట్లు చేసేందుకు సమాయత్తమవ్వాలని టీడీపీ జిల్లా నాయకులు నిర్ణయించారు.



సభకు హాజరైన ప్రజలు

ఎస్.కోటను

టీడీపీ అభివృద్ధి చేస్తుంది

● విశాఖ జిల్లాలో ఎస్.కోట కలుస్తుంది ● హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ

● ఎస్.కోటను టీడీపీ అభివృద్ధి చేస్తుంది. కొత్తవలస నుంచి తరలించిన గిరిజన విశ్వ విద్యాలయాన్ని తిరిగి ఇక్కడే నిర్మాణం చేపడ్తాం. శృంగవరపుకోట నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలో కలిపేందుకు టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు మాటిచ్చారు. పెందుర్తి-అరకు రహదారిని ఆరులైన్లుగా మారుస్తాం.

● రద్దయిన ఉత్తరాపల్లి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన కోళ్ల అప్పలనాయుడు, అప్పటి శృంగవరపుకోట గిరిజన శాసన సభ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యేందుకు సహకరించిన లగుడు సింహాద్రిలు టీడీపీకి ఎనలేని సేవ చేశారు.

● గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగంపంతులు, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, అమరజీవి పొట్టిశ్రీరాములు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వంటి మహానుభావుల వల్లే నందమూరి తారకరామారావు ప్రజల విశ్వాసానికి పాత్రులయ్యారు. ఇలాంటి వ్యక్తి కడుపున పుట్టడం నా పూర్వజన్మ సుకృతం

-కొత్తవలస రోడ్‌షోలో సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యలివి

శృంగవరపుకోట, మే 3

శృంగవరపుకోట శాసన సభ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి, విశాఖ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్‌లకు మద్దతుగా శుక్రవారం రాత్రి 9.15 గంటలకు కొత్తవలస నాలుగు రోడ్ల కూడలిలో సినీనటుడు బాలకృష్ణ ప్రసంగించారు. తొలుత తనదైన శైలిలో మహానుభావులను స్మరించారు. ఉత్తరాంధ్ర వైసీపీ ప్రజా ప్రతినిధులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారాంలు ఈ ప్రాంతానికి చేసిందేంటని ప్రశ్నించారు. అభివృద్ధి కావాలా? విధ్వంసం కావాలా? అని అడగడంతో అభివృద్ధి కావాలంటూ ప్రజలంతా నినదించారు. అయితే టీడీపీని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి, విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్‌లను గెలిపించి చంద్రబాబును సీఎంను చేయాలంటూ పిలుపునిచ్చారు. అభ్యర్థులిద్దరినీ పరిచయం చేశారు. టీడీపీ అధికార ప్రతినిధి గొంప కృష్ణ, రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఇందుకూరి సుధారాజు, జనసేన నియోజవకర్గ సమన్వయ కర్త వబ్బిన సత్యనారాయణ, బీజేపీ నాయకురాలు చొక్కాకుల జగదీశ్వరీ పాల్గొన్నారు.



అభ్యర్థులను పరిచయం చేస్తున్న బాలకృష్ణ



పేరుకే బోధనాస్పత్రి

● నత్తనడకన భవన నిర్మాణాలు ● ఆస్పత్రి పూర్తయ్యేదెప్పుడో

● అందుబాటులోకి రాని బ్లాకులెన్నో ● కీలకమైన ప్రొఫెసర్ల కొరత

● విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు అంతంతే

ప్రభుత్వ బోధనాస్పత్రి రావడంతో జిల్లా ప్రజలు ఎంతో ఆనందించారు. తమ పిల్లలు వైద్య విద్యను అభ్యసించడానికి అనువుగా ఉంటుందని, అందరికీ మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందని భావించారు. వీరు తలచినది ఒకటైతే అక్కడ జరుగుతున్నది వేరొకటి. గత ఏడాది గాజులరేగలో ఆర్భాటంగా ప్రారంభించిన మెడికల్ కళాశాలకు సంబంధించి తరగతి గదులు మినహా ఏ భవన నిర్మాణాలు పూర్తి కాలేదు. ఎప్పటికి అవుతాయో చెప్పలేని పరిస్థితి. కీలకమైన ప్రొఫెసర్‌లను కూడా పూర్తిస్థాయిలో నియమించలేదు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిది. వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ బయటకు చెప్పలేక నెట్టుకొస్తున్నారు. సరిపడా నర్సులు, నాలుగో తరగతి సిబ్బంది కూడా లేరు.



(విజయనగరం-ఆంధ్రజ్యోతి) / రింగురోడ్డు

విజయనగరంలోని గాజులరేగలో నెలకొల్పిన ప్రభుత్వ బోధనాస్పత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడానికి ఎన్నాళ్లు పడుతుందో చెప్పలేని దుస్థితి. కళాశాల కోసం 70ఎకరాలు కేటాయించారు. నిర్మాణానికి రూ.500 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నట్లు చెప్పుకొస్తున్నారు. ల్యాబ్‌లు, స్కానింగ్ యూనిట్లు, డయాగ్నోస్టిక్ విభాగం, ఫార్మసీ, ఆస్పత్రి ఇలా ఏవీ లేకుండానే మెడికల్ కళాశాలను ప్రారంభించేశారు. తరగతులు కూడా మొదలెట్టేశారు. ఇక అప్పటి నుంచి వైద్య కళాశాలను అందుబాటులోకి తీసుకువచ్చామని ప్రతి సమావేశంలోనూ వైసీపీ నాయకులు ఊదర గొడుతున్నారు. ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. తరగతులు నిర్వహించే భవనం మాత్రమే పూర్తిచేశారు. మిగిలిన బ్లాకులన్నీ నిర్మాణ దశలో ఉన్నాయి. ముఖ్యంగా 500 పడకల ఆస్పత్రి భవన నిర్మాణాలు నత్తతో పోటీ పడుతున్నాయి. ఎన్నికలు షెడ్యూల్ వచ్చినప్పటినుంచి మరింత మందకొడిగా సాగుతున్నాయి. ఈ భవనాలు, వసతిగృహ భవనాలు 2025 నాటికి కూడా అందుబాటులోకి రావడం కష్టమే అన్న పరిస్థితి కన్పిస్తోంది. ఎంబీబీఎస్ మొదటి సవంత్సరంలో ఈ ఏడాది విద్యార్థులను చేర్చుకున్నారు. తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే వారికి మౌలిక సౌకర్యాలు అంతంత మాత్రమే. భోజనంలో నాణ్యత పాటించడం లేదు. వాటి గురించి చెప్పేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. మొదటి సంవత్సరం కావడంతో సమస్యల గురించి చెబితే ఏమైనా ఇబ్బంది పెడతారేమోనని ఓర్పుతో నెట్టుకొస్తున్నారు. ప్రాక్టికల్ విద్య అరకొరగా ఉండడంతో కళాశాలలో వైద్య విద్యపై వారు తీవ్ర నిరాశతో ఉన్నారు. ప్రభుత్వ ప్రకటనలు విని.. ఇక్కడ అంతా బాగుంటుందన్న ఆశతో వచ్చారు. ఇప్పుడు వీడలేక.. చదవలేక ఇబ్బంది పడుతున్నారు. ఇదిలా ఉండ గా వైద్య కళాశాల నుంచి జేఎన్‌టీయూ- వైద్యకళాశాల కూడలికి రావా లంటే ఇంచుమించుగా కిలోమీటరు దూరం ఉంటుంది. ఈ మార్గంలో బీటీ రోడ్డు నిర్మించారు. అంతవరకు బాగానే ఉంది. వైద్య కళాశాల, గిరిజన విశ్వవిద్యాల యం తరగతులు నిర్వహించే భవనాలు ఇదే మార్గంలో ఉన్నాయి. ఈ రోడ్డులో లైట్లు లేవు. చీకటి పడిందంటే రాకపోకలకు ఇబ్బందులే. ముఖ్యంగా విద్యార్థి నులు మరింత అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. అంధకారంలో బిక్కుబిక్కు మంటూ ప్రయాణిస్తున్నారు. ఇదే మార్గంలో కార్మిక బీమా ఆసుపత్రి భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. వైఎస్‌ఆర్ నగర్‌కు వెళ్లాలన్నా ఇదే దారి. అయినా కూడా రోడ్డు వెంబడి లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం లేదు.



నిర్మాణ దశలో భవనాలు

జిల్లా కేంద్ర ఆసుపత్రే ఆధారం

బోధనాసుపత్రి అందుబాటులోకి రాని కారణంగా ప్రస్తుతం జిల్లా కేంద్ర సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోనే బోధనాస్పత్రి నడుస్తోంది. ప్రాక్టీస్ కోసం వారంతా ఇక్కడికి రావాలి. అలాగే తగినంత మంది బోధనా సిబ్బంది (ప్రొఫెసర్లు), ఇతర సిబ్బందిని నియమించలేదు. ప్రిన్సిపాల్‌ను వివరాలు కోరినా చెప్పేందుకు నిరాకరించారు.

● సిబ్బంది నివాస గృహాలు, సర్వీసు బ్లాకు తదితర నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది. నర్సింగ్ కళాశాల, సిబ్బంది నివాస గృహాల నిర్మాణాలు కూడా కాలేదు. ఏమీ లేకుండానే వైద్య కళాశాల ఇచ్చామని చెప్పేందుకే ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఈ కళాశాలలో 150 సీట్లున్నాయి. పూర్తి స్థాయిలో విద్యార్థులున్నారు కాని సౌకర్యాలే అరకొరగా ఉన్నాయి.



వైద్యం అందదా?

● నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిచేపోయే ప్రమాదం

● ముందుగా ఈహెచ్‌ఎస్ సేవలు బంద్

రాజాం, మే 3: జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. ముందుగా ఈహెచ్‌ఎస్ విభాగానికి సంబంధించి సేవలు శనివారం నిలిపివేయనున్నారు. అయినా ప్రభుత్వం స్పందించకుంటే మిగతా సేవలను కూడా ఆపేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆస్పత్రులకు రూ.2000 కోట్ల బిల్లులు చెల్లింపులు నిలిచిపోవడమే అందుకు కారణం. ఈ నెల 4 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్టు నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం ప్రభుత్వానికి స్పష్టం చేసింది. బకాయిల విషయంలో ఇప్పటికే ప్రభుత్వం నాలుగుసార్లు మాట ఇచ్చి తప్పిందని, ఇక ప్రభుత్వం మాట నమ్మేది లేదని ఆస్పత్రుల యాజమాన్యాలు తేల్చిచెబుతున్నాయి. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని వైద్యారోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి.

ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపు కొన్నాళ్లుగా సక్రమంగా జరగడం లేదు. దీంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం ప్రభుత్వానికి తరచూ విన్నవిస్తూనే ఉంది. 2023 మేలో ఇదే విధంగా సేవల నిలిపివేతకు నెట్‌వర్క్ ఆస్పత్రులు నిర్ణయించగా ప్రభుత్వం హడావుడిగా ఆ నెలకు సంబంధించి రూ.200కోట్ల బకాయిలు విడుదల చేసింది. అప్పటికి సుమారు 2 వేల కోట్లు చెల్లించాల్సి ఉండేది. విడతల వారీగా బకాయిలు చెల్లించుకుంటూ వచ్చిన ప్రభుత్వం డిసెంబరు నెలకు వచ్చేసరికి చెల్లింపులు మందగించాయి. సుమారు రూ.1000 కోట్లు బకాయి పడింది. దీంతో అదే నెల 29 నుంచి ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేతకు నెట్‌వర్క్ ఆస్పత్రులు నిర్ణయించాయి. మరోసారి ప్రభుత్వం అసోసియేషన్ ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించింది. బకాయిలు చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించడంతో యథావిధిగా సేవలు కొనసాగించారు. మళ్లీ బకాయిలు చెల్లించకపోవడంతో ఈ ఏడాది జనవరి 24 నుంచి సేవలు నిలిపివేతకు నిర్ణయించారు. దీంతో మరోసారి ప్రభుత్వం కొద్దిపాటి మొత్తాన్ని చెల్లించి సేవలు కొనసాగించేలా చేసింది. అయితే సుమారు రూ.2000 కోట్లు బకాయిలు పేరుకుపోవడంతో సేవలు కొనసాగించడం తమ వల్ల కాదని స్పష్టంచేశాయి.

ఆస్పత్రుల్లో అందని సేవలు

ఆరోగ్యశ్రీ ద్వారా అత్యవసర వైద్యసేవల కోసం వెళ్తున్న వారికి అక్కడ చుక్కెదురవుతోంది. ప్రభుత్వం మాత్రం ఆరోగ్యశ్రీకార్డు ఉన్న ప్రతి లబ్ధిదారుడికి రూ.25 లక్షల సాయం అందుతుందని చెబుతోంది. ప్రభుత్వ తీరు చూసి క్షేత్రస్థాయిలో ఆస్పత్రులు రకరకాలుగా కొర్రీలు పెడుతున్నాయి. నిరక్షరాస్యులు, పెద్దగా అవగాహన లేనివారు వెళ్తుంటే ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఆరోగ్యశ్రీ కంటే సాధారణ వైద్యానికే మొగ్గుచూపుతున్నారు.

● పొరుగున ఉన్న ఒడిశా నుంచి రోగులు ఎవరైన వస్తే మాత్రం ఇట్టే ఆస్పత్రిలో చేర్పిస్తున్నారు. వారి వైద్యసేవలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒడిశా ఆరోగ్యశ్రీ కార్డుకు పదిరోజుల్లో అప్రూవల్ వస్తుండడం, వారం రోజుల వ్యవధిలోనే అక్కడి ప్రభుత్వం చెల్లింపులు చేస్తుండడంతో జిల్లా ప్రజల కంటే ఒడిశా వాసులకే నెట్‌వర్క్ ఆస్పత్రులు ప్రాధాన్యం ఇస్తున్నాయి. జిల్లాలో ఏ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రికెళ్లినా అక్కడ కనిపించేది ఎక్కువగా ఒడిశా రోగులే.



ఎస్.కోట రూరల్: ఆటో కట్టించుకొని సీఎస్‌సీ కేంద్రానికి వచ్చిన గిరిజనులు



బొబ్బిలిలో పెన్షన్‌దారుల ఇక్కట్లు

ప్రభుత్వం ఏడిపించేన్

● రెండోరోజు కూడా వృద్ధులకు అగచాట్లు ● అయినా కొందరి చేతికి డబ్బులు అందని వైనం



రామభద్రపురంలో వృద్ధుల పడిగాపులు

రామభద్రపురం/ శృంగవరపుకోట రూరల్/ బొబ్బిలి, మే 3: ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో వృద్ధులకు రెండోరోజు కూడా అవస్థలు తప్పలేదు. బ్యాంకులో ఖాతా ఉన్నప్పటికీ లావాదేవీలు జరగక అకౌంట్‌ను అప్‌డేట్ చేయాల్సి రావడం.. ఆధార్ అనుసంధానం లేకపోవడం... ఫింగర్‌ప్రింట్లు స్కాన్ కాకపోవడం వంటి సమస్యలతో అనేక మంది వృద్ధులు పింఛన్లు తీసుకోలేక పోయారు. మరోవైపు మండుటెండలో విలవిల్లాడుతూ బ్యాంకులు, వాటి సేవా కేంద్రాలకు చేరుకున్నారు. అలసి సొలసి వెళ్లిన వారు కాసేపు విశ్రాంతి తీసుకునే అవకాశమూ లేక అక్కడ మరిన్ని ఇక్కట్లు పడ్డారు. వృద్ధులపై కనికరం లేకుండా ఇబ్బంది పెట్టడం ప్రభుత్వానికి తగదని వారంతా మండిపడుతున్నారు. ఖాతాల్లో నగదు జమైనా 3వ తేదీకి కూడా డబ్బులు చేతికి రాకపోగా రోజూ ఎండలో బ్యాంకులకు రావడానికి నరకయాతన పడుతున్నా మని వాపోతున్నారు. ఎస్.కోట మండలం బొడ్డవర గ్రామంలో పలువురు వృద్ధులు మాట్లాడుతూ రెండునెలలుగా పింఛన్లు అందించడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు బాధ కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 80 ఏళ్ల వృద్ధ మహిళ పెంటకోట అప్పల నర్సమ్మ మట్లాడుతూ గత నెల సచివాలయ సిబ్బంది చక్కగా ఇంటికి తెచ్చి పింఛన్ ఇచ్చారని, ఈ నెల ఎందుకు అలా చేయలేదని ప్రశ్నించింది. బొబ్బిలిలోనూ వృద్ధులు 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలో తీవ్ర అవస్థలు పడుతూ బ్యాంకులకు వెళ్లడం కనిపించింది.

భూమి ఉంటేనే ఓటు హక్కు

మీకు తెలుసా

విజయనగరం: రాజ్యాంగం వచ్చిన కొత్తలో ఎన్నికల్లో ఓటు వేయాలన్నా... శాసన సభ్యుడిగా... ఎంపీగా ఎన్నికల్లో పోటీ చేయలన్నా సంబంధిత వ్యక్తికి ఎంతో కొంత భూమి ఉండాలనే నిబంధన ఉండేది. అప్పట్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో గౌతు లచ్చన్న ఎన్నికల్లో పోటీచేసే సమయంలో భూమి లేకపోతే పురుషోత్తపురానికి చెందిన కిల్లి అప్పలనాయుడు వద్ద నుంచి భూహక్కు పత్రం పొందిన తరువాత ఎన్నికల్లో పోటీ చేశారు. అప్పట్లో 21 సంవత్సరాలు నిండిన వారికి... విద్యావంతులకే ఓటుహక్కు ఉండేది.



రాజకీయ అల్లరీ నేరమే

(కొమరాడ)

ఏదైనా రాజకీయ పార్టీ ప్రచారానికి గ్రామాలకు వెళ్లినప్పుడు... అక్కడ నిర్వహించే సమావేశాలను ఆ పార్టీకి సంబంధం లేని వ్యక్తి అడ్డుకోవడం... భంగ పరచడానికి ప్రయత్నించడం కూడా అపరాధమే అవుతుంది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష, రెండు వేల రూపాయల జరిమానా విధించే అవకాశం ఉంది. నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయి. ప్రచార సభకు అధ్యక్షత వహించే నాయకుడు అనుమానం వచ్చిన వ్యక్తి గురించి వివరాలు రాబట్టుకోవచ్చు. ఇక పోలీసులకు కూడా ఆ వ్యక్తి తన వివరాలను చెప్పకపోతే వారెంట్ లేకుండా అతడిని నిర్బంధంలోకి తీసుకోవచ్చు.



అప్పటికీ.. ఇప్పటికీ ఎంతో తేడా

పెద్దల మాట

వీరఘట్టం: పాత కాలం ఎన్నికలకు... ఇప్పటి ఎన్నికలకు ఎంతో తేడా ఉంది. అప్పటి ఎన్నికల్లో గందరగోళం ఉండేది కాదు. ప్రశాంతగా ఎన్నికలు జరిగేవి. డబ్బు ప్రభావం ఉండేది కాదు. ఎవరికి నచ్చిన పార్టీకి వారు ఓటు వేసే వారం. ప్రజలకు మేలు చేసే వారికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారం. ఎన్నికలకు ముందు వారం పది రోజులు మాత్రమే ప్రచారాలు ఉండేవి. ఎన్నికల వరకే రాజకీయాలు. ఆ తర్వాత అందరం కలిసిమెలిసి ఉండేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. పార్టీల వారీగా విడిపోయి కక్షలకు పోతుండడం బాధగా ఉంది. ఆ రోజులు మళ్లీ ఎప్పుడు వస్తాయో. ఇప్పటి నాయకుల్లో రాజకీయ చైతన్యం ఎంతో ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గెలుపే లక్ష్యంగా ఇప్పుడు రాజకీయాలు సాగుతుండడం దురదృష్టకరం.

- నడికట్ల రామచంద్రరావు (వయస్సు 80),
వీరఘట్టం, పార్వతీపురం మన్యం జిల్లా



విశిష్టతల సంగమం.. రాజాం

- చారిత్రక ప్రదేశాలు
- విశిష్ట వ్యక్తులు
- వింతలు, విశేషాల కలబోత

(రాజాం రూరల్)

రాజాం.. ఎన్నో ప్రత్యేకతల సంగమం..ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు నిలయం. చారిత్రక ప్రదేశాలు, విశిష్ట వ్యక్తులు, వింతలు, విశేషాలకు పుట్టినిల్లు. కళాకారులు, కర్రతో నగల తయారీదారులకు కొలువైన ప్రాంతం. సాముగరిడీలలో ఆరితేరిన వారు. సాగునీటి వనరులు.. ఇలా ఎన్నో విశేషాల సమాహారం.

ఎన్నో ప్రత్యేకతలు

ఈ నియోజకవర్గంలోని విశేషాలను పరిశీలిస్తే....కాశీ తరువాత అంతటి ప్రాధాన్యం ఉన్న త్రివేణి సంగమం వంగర మండలం సంగాం గ్రామ పరిసరాల్లో ఉంది. నాగావళి, వేగావతి, సువర్ణముఖి నదులు ఇక్కడే కలుస్తాయి. త్రివేణి సంగమంలో స్నానం చేసి.. శివాలయంలో పూజలు చేస్తే కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకున్నంత ఫలితమని ప్రజల నమ్మకం.

- ఈ మండలం మద్దువలస ప్రాజెక్టును ఆనుకొని ఉన్న కొండపై పాండవుల పంచ ఉంది. వనవాసం సమయంలో ఇక్కడే పాండవులు ఉన్నారని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.
- సంతకవిటి మండలం గుళ్ల సీతారాంపురంలో సీతారామాలయం ప్రసిద్ధికెక్కింది. అయిదు శతాబ్దాల క్రితం బొబ్బిలి రాజులు నిర్మించిన ఈ ఆలయంలో ఏకశిలపై చెక్కిన సీత, రాముడు, ఆంజనేయుడి విగ్రహం 15వ శతాబ్దం నాటి శిల్పుల పనితనానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇక్కడి శిల్పకళా సంపద సందర్శకులను పరవశింపజేస్తుంది.
- ఇదే మండలం సిరిపురం గ్రామంలో వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తామరచెరువు జిల్లాలోనే అతి పెద్దది.
- రాజాం పట్టణంలోని నవదుర్గ అమ్మవారి ఆలయం దేశంలోనే ఏకైక ఆలయం. తొమ్మిది మంది దుర్గలతో కూడిన ఆలయం దేశంలో మరెక్కడా లేదు.
- ఇక్కడే వెలిసిన పోలిపల్లి పైడితల్లి అమ్మవారు ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవంగా వెలుగొందుతోంది. ఈ మండలం రాజయ్యపేటలోని వరదరాజ స్వామి ఆలయం వందల ఏళ్ల క్రితం నిర్మించారు.



సంతకవిటి మండలం గుళ్లసీతారాంపురంలో ఐదు దశాబ్దాల కిందట బొబ్బిలి రాజులు నిర్మించిన సీతారామస్వామి ఆలయం



ఒకప్పటి పోలీసు స్టేషన్

విశిష్ట వ్యక్తులు ఇక్కడివారే..

- ప్రపంచ పారిశ్రామిక చిత్రపటంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న గ్రంధి మల్లికార్జునరావుది (జీఎంఆర్.) రాజాం.
- బీహార్ ఎన్నికలలో సంచలనాలకు మారుపేరుగా నిలిచిన కేంద్ర ఎన్నికల మాజీ సలహాదారు కేజే రావు స్వగ్రామం రేగిడి మండలం కొండల మామిడివలస.
- హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన దివంగత కొత్తపల్లి పున్నయ్యది సంతకవిటి మండలం కావలి గ్రామం.
- ప్రత్యేకమైన చెక్కతో ఆభరణాలు తయారుచేసే నిపుణులు మండలం పనసలవలసలో ఉండేవారు. పౌరాణిక నాటకాలలో నటులు వీటిని వేసుకునేవారు. రోల్డ్‌గోల్డ్ ఆభరణాల ప్రాముఖ్యం పెరగడంతో వృత్తికి వీరు దూరమయ్యారు.
- తానీషా ఆస్థానంలో మంత్రులుగా పనిచేసిన అక్కన్న, మాదన్న పేర్లతో రేగిడి మండలంలో అక్కన్న అగ్రహారం, మాధవ రాయపురం గ్రామాలు ఉన్నాయి.



వంగర మండలం సంగాం గ్రామంలో గల సంగమేశ్వర స్వామి ఆలయం

చారిత్రకంగా..


- బొబ్బిలి రాజుల హయాంలో ఇక్కడి రాణావీధిలో నిర్మించిన భవనంలో తాండ్ర పాపారాయుడు ఉండేవారు. ఇదే భవనంలో ప్రత్యేకంగా జైలుగది కూడా ఉంది. పాపారాయుడు మెడలో ధరించే ఆభరణం ఇప్పటికీ భద్రంగా ఉంది.
- బొబ్బిలి రాజులు నివాసం ఉండే కోటలో కోర్టుల సముదాయం ఉండేది. ఈ భవనాలన్నీ ఇప్పుడు శిథిలావస్థకు చేరుకున్నాయి.
- బొబ్బిలి రాజుల హయాంలోని నిర్మాణాల శిథిలాల ఆనవాళ్లు ఇప్పటికీ రేగిడి మండలం ఉంగరాడ, సంతకవిటి మండలం వావిలవలస, జీఎస్ పురం గ్రామాల్లో ఉన్నాయి.
- జమిందారీ పోరాటానికి ఊపిరిపోసిన సింహాద్రి సూర్యనారాయణ, అప్పన్న సోదరులది రేగిడి మండలం ఆడవరం గ్రామం.
- రాజాం నుంచి చీపురుపల్లి వెళ్లే మార్గంలో ఉన్న జెండాల దిబ్బ ప్రాంతానికి కూడా చారిత్రక నేపథ్యం ఉంది. విజయనగరం, బొబ్బిలి రాజులు యుద్ధ సమయంలో ఇక్కడ రెండు రాజ్యాల జెండాలు పాతారని... అందుకే ఈ ప్రాంతానికి జెండాల దిబ్బగా పేరు వచ్చిందని చెబుతారు.



తాండ్ర పాపారాయుడు



అప్పట్లో బొబ్బిలి రాజుల విశ్రాంతి భవనం



నెల్లిమర్ల జూట్ మిల్లు

కార్మికులే కీలకం

- శ్రమజీవుల ఓట్ల కోసం పార్టీల యత్నాలు
- ఇదీ నెల్లిమర్ల నియోజకవర్గం పరిస్థితి

నెల్లిమర్ల: నెల్లిమర్ల పేరు చెబితే ప్రధానంగా గుర్తుకు వచ్చేది కార్మిక లోకం. ఎన్నికల ఫలితాల్లో వీరి ఓట్లే కీలకం. ఈ నియోజక వర్గంలో రైతులు అధికంగా ఉన్నారు. ఆ తర్వాత స్థానంలో కార్మికులు ఉంటారు. నెల్లిమర్ల నియోజకవర్గ కేంద్రంలో వంద సంవత్సరాల చరిత్ర కలిగిన నెల్లిమర్ల జూట్ మిల్లు ఉంది. దీనిపై ఆధార పడి సుమారు 12 గ్రామాలకు చెందిన 5 వేల కుటుంబాల వారు ఉన్నారు. వీరి కుటుంబాల్లో సుమారు 30 వేలకు పైగా ఓట్లు ఉన్నాయి. అలాగే పూసపాటిరేగ మండల పరిధిలోని ఫార్మా కంపెనీల్లో వేలాది మంది కార్మికులు ఉన్నారు. ఈ ఫార్మా కంపెనీల్లో పనిచేస్తున్న వారిలో నెల్లిమర్ల మండలం శివారు గ్రామాల వారితో పాటు పూసపాటిరేగ, డెంకాడ మండలాల వారు కూడా ఉన్నారు. వీరంతా మరో 40 వేల మంది వరకు ఉన్నారు. నియోజక వర్గంలో సుమారు 2 లక్షల 13 వేల ఓట్లుగా ఉండగా వీరిలో కార్మికులు దాదాపు 70 వేల మంది వరకు ఉన్నారు. వీరి ఓట్లను ఆకట్టుకునేందుకు ఇటు అధికార వైసీపీ అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడుతో పాటు, కూటమి అభ్యర్థి లోకం నాగమాధవి ఎవరికి వారు ప్రయత్నాలు ప్రారంభించారు. ఫార్మా కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులు కాకుండా... మిగిలిన వారంతా విద్యావంతులైన ఉద్యోగులే. నిజానికి వీరంతా తటస్థులనే చెప్పాలి. వీరి ఓట్లకు కూడా గాలం వేసేందుకు వారు నివసిస్తున్న ప్రాంతాల్లో వివిధ పార్టీల నాయకులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.



ర్యాలీగా వెళ్తున్న జూట్ కార్మికులు (ఫైల్)

ఓటు దారిలో...

- విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక సదుపాయం
- పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, వీల్‌చైర్ల సౌకర్యం
- బ్రెయిలీ లిపిలో నమూనా బ్యాలెట్ పేపర్

కలెక్టరేట్, మే 3: ఈ సార్వత్రిక ఎన్నికలలో విభిన్న ప్రతిభావంతులు ఓటు వేయడానికి జిల్లా యంత్రాగం ప్రత్యేక సదుపాయం కల్పిస్తోంది. శతశాతం ఓటింగ్ నమోదు చేయాలనే లక్ష్యంతో కలెక్టర్ నాగలక్ష్మి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. వృద్ధులు, దివ్యాంగులు అందరూ ఓటు వేసే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. వారు పోలింగ్ కేంద్రాలలో ఓటు వేసేందుకు అనువైన వాతావరణం, వసతులు కల్పించే చర్యలు చేపట్టారు. జిల్లాలోని 1,847 పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు ఏర్పాటు చేశారు. అలాగే వీల్‌చైర్లు, త్రిచక్ర వాహనాల సౌకర్యం కల్పిస్తున్నారు. నడవలేని వారిని పోలింగ్ కేంద్రంలోకి చేర్చేందుకు జిల్లా వ్యాప్తంగా 716 వీల్‌చైర్లు సిద్ధం చేశారు.

ఎక్కడెక్కడంటే...

రాజాం నియోజకవర్గంలో 114, బొబ్బిలిలో 113, చీపురుపల్లిలో 138, గజపతినగరంలో 76, నెల్లిమర్లలో 56, విజ యనగరంలో 76, ఎస్.కోటలో 87, మెంటాడ మండలంలో 26 వీల్ చైర్లు అందుబాటులో ఉంచుతున్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఎస్కార్ట్‌ల సహకారంతో వీల్‌చైర్ల ద్వారా దివ్యాంగులు, వయోవృద్ధులు పోలింగ్ కేంద్రంలోకి చేరుకునే విధంగా చర్యలు చేపడుతున్నారు. మరోవైపు జిల్లాలో 35 వేల ఓటరు గైడ్‌లు ముద్రించారు. వీటిని వృద్ధులు, దివ్యాంగులకు అందజేస్తున్నారు.

అంధుల కోసం 4,865 ఓటర్లు స్లిప్పులు

అంధుల కోసం బ్రెయిలీ లిపిలో ప్రత్యేకంగా ఓటర్ స్లిప్పులు, పోస్టర్లను ముద్రిస్తున్నారు. తమ ఓటు వివరాలను తెలుసుకొనేందుకు అంధులకు బ్రెయిలీ లిపిలో సుమారు 4,865 ఓటరు స్లిప్పులను ముద్రించి అందజేయనున్నారు. బ్రెయిలీలో పోస్టర్లను ముద్రించి... అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఉంచుతారు. ఈవీఎంలపై బ్రెయిలీ లిపిలో అభ్యర్థుల వరుస నెంబర్లను తెలియజేసే సదుపాయం ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తెచ్చింది.

సాక్ష్యం యాప్

దివ్యాంగులకు సాయం కోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా సాక్ష్యం యాప్‌ను రూపొందించింది. ఓటరుగా నమోదు చేసుకోవడం, మార్పులు, చేర్పులు, పోలింగ్ కేంద్రాన్ని తెలుసుకోవడం, వీల్ చైర్ రవాణా, అంధులకు వాయిస్ ద్వారా సహకరించడం, వినికిడి లోపం ఉన్న వారికి టెక్స్ట్ టు స్పీచ్ తదితర సహాయ సహకారాలను ఈ యాప్ ద్వారా విభిన్న ప్రతిభావంతులు పొందవచ్చు.



సిద్ధం చేసిన వీల్ చైర్లు




పోలింగ్ కేంద్రం వద్ద ర్యాంపు

మోడల్ పోలింగ్ స్టేషన్లు

దివ్యాంగులకు ఓటు వేసే విధానం పట్ల మరింత అవగాహన కల్పించేందుకు.. వారిని పోలింగ్ కేంద్రాలకు రప్పించేందుకు జిల్లాలో రెండు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విజయనగరంలోని కొత్త అగ్రహారం, నెల్లిమర్ల నియోజకవర్గంలోని డెంకాడ మండలం పూతికపేట పోలింగ్ కేంద్రాలను మోడల్ పోలింగ్ కేంద్రాలుగా తీర్చిదిద్దారు.

హోమ్ ఓటింగ్‌కు అవకాశం

పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయడానికి అవకాశం లేని 85 ఏళ్లు పైబడిన వృద్ధులు... 40 శాతం వైకల్యం దాటిన విభిన్న ప్రతిభావంతులు తమ ఇంటివద్దనే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ ఈ ఏడాది కొత్తగా అందుబాటులోకి తీసుకుని వచ్చింది. జిల్లాలో సుమారు 21,993 మంది విభిన్న ప్రతిభావంతులు, సుమారు 7,181 మంది 85 ఏళ్లు పైబడిన వృద్ధులు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో హోమ్ ఓటింగ్ సదుపాయాన్ని వినియోగించుకోవడానికి 86 మంది దివ్యాంగులు, 156 మంది వృద్ధులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 7 నుంచి 10వ తేదీ మధ్య అధికారులు వీరి ఇళ్లకు వెళ్లి ఓటు తీసుకుంటారు.



చీపురుపల్లి నియోజకవర్గం మ్యాప్

విజయనగరం జిల్లాలో చీపురుపల్లి నియోజక వర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ ఎక్కువ కాలం ఇతర ప్రాంతాల నాయకులే కీలక పదవులు చేపట్టారు. అత్యధికంగా మెరకముడిదాం మండలానికి చెందిన వారు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు.

మెరకముడిదాం మొనగాళ్లు

- 13 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు అక్కడి వారే
- చీపురుపల్లి నాయకులకు రెండుసార్లే ఛాన్స్

(చీపురుపల్లి)

చీపురుపల్లి నియోజకవర్గ రాజకీయాల్లో ఎక్కువ కాలం స్థానికేతరులే చక్రం తిప్పారు. రాజకీయ చైతన్యం ఉన్న ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన వారిలో ముఖ్యంగా మెరకముడిదాం నాయకులు మొదటి స్థానంలో నిలవగా... శ్రీకాకుళం జిల్లాకు చెందిన నాయకులు రెండో స్థానంలో నిలిచారు. ఇప్పటి వరకూ ఎన్నికైన 13 మంది సభ్యుల్లో ఐదుగురు మెరకముడిదాం మండలానికి చెందిన వారు. ముగ్గురు శ్రీకాకుళం జిల్లా వాసులకు అవకాశం దక్కింది. ఒకరు విజయనగరం నుంచి వచ్చి గెలవగా... కేవలం ఇద్దరు మాత్రమే చీపురుపల్లిలో స్థిర నివాసం ఏర్పరచుకొని...ఇక్కడి సీటును కైవసం చేసుకోగలిగారు.



చీపురుపల్లి పట్టణం

అలా మొదలైంది

1952లో చీపురుపల్లి నియోజకవర్గం ఏర్పాటయ్యే నాటికి చీపురుపల్లి, మెరకముడిదాం, జి.సిగడాం, పొందూరు మండలాలు ఈ నియోజకవర్గంలో విలీనమై ఉండేవి. ఆ సమయంలో ఈ అసెంబ్లీ సీటుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం మెరకముడిదాం మండలానికి చెందిన నాయకులకే దక్కింది. 1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో మెరకముడిదాం మండలం గర్భాం గ్రామానికి చెందిన తాడ్డె చిన అచ్చిన్నాయుడు గెలుపొంది... చీపురుపల్లి రాజకీయాల్లో స్థానికేతరుల హవాకు పునాదులు వేశారు. అనంతరం 1955లో జరిగిన ఎన్నికల్లో మెరకముడిదాం గ్రామానికి చెందిన ముదుండి సత్యనారాయణరాజు, 1962లో అదే మండలంలో చినబంటుపల్లికి చెందిన కోట్ల సన్యాసప్పలనాయుడు, 1967లో గర్భాంకు చెందిన తాడ్డె రామారావు, 1972లో ఇప్పలవలసకు చెందిన రౌతు పైడపునాయుడులు వరుసగా విజయం సాధించారు. రెండు దశాబ్దాల పాటు మెరకముడిదాం హవాకు ఎదురు లేదనిపించారు. ఆ తరువాత నియోజకవర్గాల పునర్విభజనలో మెరకముడిదాం మండలం తెర్లాం నియోజకవర్గంలో విలీనమైంది. కొత్తగా శ్రీకాకుళం జిల్లాలోని జి. సిగడాం, పొందూరు మండలాలు చీపురుపల్లిలో చేరాయి. అక్కడి నుంచి శ్రీకాకుళం నాయకుల హవా ప్రారంభమైంది.

వీరు ఇలా...

1978లో జరిగిన ఎన్నికల్లో శ్రీకాకుళానికి చెందిన చిగిలిపల్లి శ్యామలరావు, 1983లో త్రిపురాన వెంకటరత్నం, 1989లో జి.సిగడాం మండలం టంకాల దుగ్గివలస గ్రామానికి చెందిన టంకాల సరస్వతమ్మలు గెలుపొందారు. 2004, 2009 సంవత్సరాల్లో విజయనగరానికి చెందిన బొత్స సత్యనారాయణ గెలిచారు. 2014లో జరిగిన ఎన్నికల్లో కూడా శ్రీకాకుళం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలానికి చెందిన కిమిడి మృణాళిని విజయం సాధించారు. ఇక్కడే నివాసం ఉంటూ ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన వారిలో కెంబూరి రామ్మోహనరావు, గద్దే బాబూరావులు మాత్రమే ఉన్నారు. వీరిలో కెంబూరి రామ్మోహనరావు సొంత గ్రామం పుర్లి అయినప్పటికీ... తాత, తండ్రుల కాలం నుంచి చీపురుపల్లిలో స్థిరపడిపోవడంతో ఇక్కడి నాయకుడిగానే గుర్తింపు పొందారు. అదే విధంగా గద్దే బాబూరావు సుమారు నాలుగు దశాబ్దాల కిందట కృష్ణా జిల్లా నుంచి వలస వచ్చినప్పటికీ... పట్టణంలో స్థిర నివాసం ఏర్పరచుకొని ఇక్కడే ఉండిపోవడంతో స్థానికుడయ్యారు.



తాడ్డె చిన అచ్చిన్నాయుడు



తాడ్డె రామారావు



కోట్ల సన్యాసప్పలనాయుడు

ఆలే ఈలు.. ఈలే ఆలు!

- అవేన్రా ఎలచ్చన్ నెక్కలు

(చీపురుపల్లి)

ఎన్నికల ప్రచారం ముమ్మురంగా సాగుతోంది. ఓ పల్లెటూరిలో అంతకు రెండు రోజుల కిందట రెండు ప్రధాన పార్టీలు బహిరంగ సభ నిర్వహించాయి. అప్పటి నుంచీ గ్రామంలోని రచ్చబండ వద్ద విశ్లేషణలు సాగుతూనే ఉన్నాయి. సభ జరిగిన తీరుపై రకరకాల వ్యాఖ్యానాలు, విమర్శలు, ప్రతి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే ఓ రోజు సాయంత్రం ఇద్దరు వ్యక్తుల మధ్య రసవత్తర చర్చ జరుగుతోందిలా..

ఎంకడు: అవున్రా.. కిష్టా! నీవు ఏడో క్యాసు సదివినావు కదా.. నిన్నట్నుండి నీకొకటడుగుదావనుంద్రా..

కిష్ట: ఏట్రా అది?

ఎంకడు: మొన్న బుదారం సాయంకాలం మనూల్లో మీటింగెట్నారా పచ్చ పారిటీవోల్లు. ఆ మీటింగికట ఎయ్యి మందొచ్చినారని అన్నార్రా...

కిష్ట: అన్నీరా... అంతే నీకేటి?

ఎంకడు: ఓరది కాదురా.. అ మర్నాడు తెల్ల పారిటీ కూడా ఎట్నాది కదారా మీటింగు..

కిష్ట: అవును.

ఎంకడు: అదేన్రా.. ఆలు కూడా అన్నార్రా... పన్నెండొందల మంది వొచ్చినారని..


కిష్ట: అవున్రా.. అయితే నీకేట్రా బాద?

ఎంకడు: ఓరి బాద కాదురా.. మనూరు జెనాబా ఎంతరా?

కిష్ట: కిందటేడాదికి పిల్లా పిచ్చుకా కలిపి పదమూడొందల్రా..

ఎంకడు: అదుగో.. అద్గదే మరి.. ఆలకి ఎయ్యిమంది...ఈలకి పన్నెండొందల మంది కలిపితే.. రెండేలు దాటిపోనాదా..? ఇంత మందెక్కణ్ణించొచ్చినార్రా బాబూ?

కిష్ట: ఓరి ఎర్రిమాలోకవా.. అదేట్రా నీ డౌటు.. ఆలే ఈలు. ఈలే ఆలు.. అవేన్రా ఎలచ్చన్ నెక్కలు. ఎక్కువ ఆలోసించి బుర్ర పాడెట్టుకోకు. అల్లదో... మాయప్ప పిలత్తంది. సీకటొడిపోనాది. ఇంటికెల్లి నాలుగు మెతుకులు తిను.



11వ తేదీకి పోలింగ్ కేంద్రాలు సిద్ధం

- ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం

కలెక్టరేట్, మే 3: ఈ నెల 11వ తేదీకే పోలింగ్ కేంద్రాలను అన్ని వసతులతో సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, మరుగుదొడ్లు, నేమ్ బోర్డులతో సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం ఎంపీడీవోలు, తహశీల్దారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 12న ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారని... అందువల్ల 11వ తేదీ నాటికే ఏర్పాట్లు పూర్తి కావాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఆరు మౌలిక వసతులు తప్పసరిగా ఉండాలని చెప్పారు. సిబ్బందికి, ఓటర్లకు సరిపడేలా తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని గదుల్లో తగినంత లైటింగ్ ఉండాలని, బాత్ రూమ్‌లలో కూడా లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓటర్లు ఎండకు ఇబ్బంది పడకుండా నీడ కోసం టెంట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూలైన్లకు అందుబాటులో తాగునీరు ఉండాలన్నారు. పోలింగ్ సిబ్బందికి నాణ్యమైన ఆహారం, పానీయాలు అందించాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎన్నికల ఏర్పాట్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ కార్తీక్, డీఆర్వో అనిత తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

పోస్టల్ బ్యాలెట్ కోసం ఇప్పటికే ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు (ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నవారు) తమ ఓటు హక్కును ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకూ వినియోగించుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ఓటు వేయవచ్చుని సూచించారు.

పోలింగ్‌ను బహిష్కరిస్తే రీపోలింగ్ ఉండదు

(విజయనగరం)

ఏ కారణం చేతనైనా పోలింగ్ ప్రారంభం కావడం ఆలస్యమయితే పోలింగ్ సమయాన్ని పెంచరు. నిర్దేశిత సమయానికి క్యూలైన్లలో ఉన్నవారికి ఓటు వేసేందుకు అనుమతిస్తారు. ఎంత రాత్రయినా సరే వారంతా ఓటు వేసే వరకూ పోలింగ్ కొనసాగుతుంది. ఎక్కడైనా పోలింగ్‌ను బహిష్కరిస్తే రీ పోలింగ్ ఉండదు. పోలింగ్ కేంద్రంలో గానీ, కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో గానీ అభ్యర్థితో పాటు ఏ వ్యక్తి కూడా ఫలానా గుర్తు, వ్యక్తికి ఓటు వేయాలని ప్రచారం చేయడం శిక్షార్హం. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951, సెక్షన్ 130 ప్రకారం నేరం. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఏవైనా కారణాలతో ఓటింగ్‌ను బహిష్కరిస్తే రీపోలింగ్ నిర్వహించరు. పోలింగ్ కేంద్రం పరిధిలోగానీ, 100 మీటర్ల దూరంలో గానీ అభ్యర్థి మీడియాతో మాట్లాడకూడదు. అది చట్టరీత్యా నేరం. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడానికి గన్‌మెన్‌కు అనుమతి లేదు. ఒక వేళ ఓటు వేసేందుకు గన్‌మెన్ వస్తే తన ఆయుధాన్ని బయట ఉన్న పోలీసుల వద్ద ఉంచి ఓటు వేసి తిరిగి వచ్చి తన ఆయుధాన్ని తీసుకోవాలి. ఓటు వేసే సమయంలో ఫొటోలు తీయడం, వీడియో చిత్రీకరణ నేరం. ఇది రహస్య ఓటింగ్‌కు భంగం కలిగిస్తుంది.

ఎట్లయిననూ.. వెదికి పట్టుకోవలె!



- ఓటరు జాబితాల్లో పేర్లున్నా.. జాడ లేని వైనం
- వలస ఓటర్ల ఆచూకీ కోసం నేతల అగచాట్లు
- ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ

(విజయనగరం)

విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. పోటీలో ఉన్న వారు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఎన్నికల వ్యూహ రచనలో తలమునకలవుతున్నారు. పోటీ రసవత్తరంగా మారుతుండడంతో అభ్యర్థులు, వారి అనుచరులు గెలుపునకు ఉండే అన్నిమార్గాలూ అన్వేషిస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా మెజార్టీ సాధించాలని పట్టుదలతో ఉన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో వలస ఓటర్లపై అభ్యర్థులు దృష్టి సారించారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో మాత్రమే వలస ఓటర్లను స్వస్థలాలకు రప్పించి ఓట్లు వేయించేవారు. ప్రస్తుతం పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు వలస ఓటర్లను ఎలాగైనా తెప్పించి ఓటు వినియోగించేకునేలా చూడాలని చర్యలు ప్రారంభించారు.



అభ్యర్థుల అగచాట్లు

ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నా, స్థానికంగా వారు కనిపించకపోవడంతో ఎక్కడ ఉంటారో, ఎలా వారిని పోలింగ్ బూత్‌కు రప్పించాలోనని ఆందోళన చెందుతున్నారు. వారి ఆచూకీ కోసం ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు అగచాట్లు పడుతున్నారు. పార్టీల్లోని వార్డు ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, బూత్ ఏజెంట్ల ద్వారా పట్టణాలతో పాటు పల్లెల్లో కూడా ఇంటింటికి తిరిగి ఓటర్ల వివరాలు సేకరిస్తున్నారు. జాబితాలో ఉన్న ఓటర్లు స్థానికంగా ఎంతమంది ఉన్నారు. ఇతర ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ఉన్నారు. వారిని ఎలా రప్పించాలి.. తదితర అంశాలపై దృష్టిపెట్టారు. పట్టణాల్లో ఒక్కో వార్డులో 50 నుంచి 100 మంది వరకు వలస ఓటర్లు ఉండగా, పల్లెల్లో వర్షాభావం వల్ల ఈ ఏడాది వేల సంఖ్యలో వలసవెళ్లారు. గతంలో బీఎల్వోలు ఇంటింటా తిరిగి ఎక్కడ నివాసం ఉంటున్నారో అక్కడ వారి ఓట్లను చేర్చాలని అధికారులు కోరినా కొందరు పట్టణాల్లో అమలు చేయలేదు. ప్రస్తుతం అటువంటి ఓటర్లకు బీఎల్వోలు స్లిప్పులు ఎలా ఇస్తారో అంతుపట్టడం లేదు. ఈ నేపథ్యంలో వలస ఓటర్ల స్థానంలో పట్టణ ప్రాంతాల్లో దొంగ ఓట్లు పడే అవకాశాలు ఉన్నాయని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి వలస వెళ్లిన వారి ముఖాలు పోలింగ్ ఏజెంట్లకు తెలియకపోవడం... పట్టణ ప్రాంతాల్లో పరిచయాలు పెద్దగా లేకపోవడం తదితర కారణాల వల్ల ఒకరి ఓటు మరొకరు వేసే అవకాశం ఉంటుంది.

రప్పించేందుకు ప్రయత్నాలు

ఇతర రాష్ట్రాలు, పట్టణాల్లో ఉన్న వలస ఓటర్ల ను రప్పించేందుకు గ్రామాల్లో రాజకీయ నాయకులు ఇప్పటినుంచే ప్రయత్నాలు మొదలెట్టారు. ఇందుకోసం గ్రామాల నేతలను పార్టీ కార్యాలయాలకు రప్పించి ఓటర్ల జాబితాల్లో ఉన్న వలస ఓటర్లను గుర్తిస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, చెన్నై, ముంబై, కోల్‌కతా తదితర ప్రాంతాల్లో ఉన్న వలస ఓటర్లను రప్పించేందుకు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. వారికి వీలైతే బస్సులు ఏర్పాటు చేయడం కానీ... లేదా ఫోన్లు చేసి ఫోన్‌పే ద్వారా రానూ పోనూ ఖర్చులకు డబ్బులు పంపించి రప్పించేందుకు ప్రయత్నాలు మొదలెట్టారు.

ఖర్చుకు వెనుకాడని వైనం

శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల ప్రధాన పార్టీల నుంచి తొలిసారి చట్టసభల్లోకి వెళ్లాలని ఉవ్విళ్లూరుతున్నారు. వీరంతా వ్యయానికి సైతం వెనకడుగు వేయడంలేదు. దీంతో తక్కువ సమయం ఉన్నా తమకు ఖచ్చితంగా పడతాయని భావించి వలస ఓటర్లను రప్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షాభావం వల్ల వ్యవసాయ కాలం తర్వాత వేలాది మంది చెన్నై, ముంబై తదితర ప్రాంతాలకు ఉపాధి కోసం వలస వెళ్తుంటారు. ప్రతి ఎన్నికల్లో నాలుగు వేలమంది వరకూ ఓటు హక్కు వినియోగించుకోవడానికి వస్తుంటారని అంచనా. దేశంలోని వివిధ ప్రాంతలతోపాటు సౌదీఅరేబియా తదితర ప్రాంతాల్లో ఉపాధి కోసం వందల సంఖ్యలో వలస వెళ్లి ఉంటారని వివిధ గ్రామాల పెద్దలు చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకం కావడంతో వలస ఓట్లకు ప్రాధాన్యం ఏర్పడింది.



కూటమి గెలిస్తే పేదలకు రెండు సెంట్ల స్థలం: అదితి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అదితి

విజయనగరం రూరల్, మే 3: టీడీపీ, జన సేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇళ్లు లేని నిరు పేద, పేద, మధ్యతరగతి వారికి రెండు సెంట్ల స్థలం వస్తుందని, ఇళ్లు లేని వారు ఎవరూ రాష్ట్రంలో ఉండకూడదనే లక్ష్యంతో చంద్రబాబు ఈ విధంగా ఆలోచన చేశారని ఎన్‌డీఏ కూటమి విజయనగరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె శుక్ర వారం తొమ్మిదో డివిజన్ పరిధిలోని కోట్ల మాదప్పవీధి, కస్పా హైస్కూల్ వీధి, అయ్యకోనేరు గట్టు తది తర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. చంద్రబాబు వచ్చిన వెంటనే తొలి సంతకం మెగా డీఎస్సీపైన, రెండో సంతకం ల్యాండ్ టైటిల్ చట్టంపైన పెడతారన్నారు. రాష్ట్ర రక్షణకు ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని అదితి గజపతిరాజు పిలు పునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 37వ డివిజన్ వైసీపీకి చెందిన నా మన శ్రీనివాసరావు, రెడ్డిపల్లి అప్పలరాజు, పల్లంశెట్టి శ్రీనివాసరావుతో పాటు 40 కుటుంబాలు, అదే విధంగా 48వ డివిజన్‌కు చెందిన రాంబార్కి బుజ్జి, రాంబార్కి కృష్ణకుమారి, కోట్ల తాతారావు, నడిపిల్లి సూరిబాబుతో పాటు 400 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ఎన్నికల్లో రెండు ఓట్లను సైకిల్ గుర్తుపై ఓసి, తనని, కలిశెట్టి అప్పలనాయుడిని గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, కంది మురళీనాయుడు, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, మార్తి నారాయణప్పడు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను గద్దె దింపడమే మన లక్ష్యం: కోండ్రు

రాజాం: జగన్‌ను గద్దె దింపడానికి అందరం కలిసి కట్టుగా పనిచేయాలని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని వైసీపీకి చెందిన 70 కుటుంబాలు టీడీపీలో చేరాయి. రేగిడి మండలం లచ్చన్న వలస గ్రామానికి చెందిన 30 కుటుంబాలు, నాయరాలవలసకు చెందిన 20 కుటుంబాలు.. వంగర మండ లం బంగారువలస గ్రామానికి చెందిన 20 కుటుంభాలు టీడీపీ తీర్థం తీసుకున్నారు. వారికి పార్టీ కండు వా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సీఎంను గద్దె దించాలంటే అందరు సైనికుల్లా పనిచేసి టీడీపీ విజయానికి కృషిచేయాలన్నారు. వైసీపీకి చెందిన అలికాన ఆదినారాయణ, కొవ్వాడ రాముడు తదితరులు, లచ్చన్నవలసకు చెందిన మీసాల పారంనాయుడు. జయ లక్ష్మీ, నారాయణరావు తదితరులు, బంగారువలసకు చెందిన ఎం.నాగభూషణం, స్వామినాయుడు తదిత రులు ఉన్నారు. పార్టీ నాయకులు కూడా పాల్గొన్నారు. ● **రేగిడి:** మండలంలో బాలికావలస, మునకల వలస, కొర్లవలస, ఉణుకూరు, ఒప్పంగి, బూరాడ తదితర గ్రామాల్లో కోండ్రు ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. ర్యాలీలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కోండ్రు మాట్లాడుతూ ఒకే ఒక్క చాన్స్ అంటూ జగన్ అధికారంలోకి వచ్చి వ్యవస్థలను దుర్వినియోగం చేసి రాష్ట్ర భవిష్యత్‌ను నాశనం చేశాడని ఆరోపించారు. మండల టీడీపీనేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కు మార్, పాలవలస రామచంద్రినాయుడు, మజ్జి శ్రీనివాసరావు, మంతిన ఉషారాణి, తదితర్లు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో కోండ్రు మురళీమోహన్

రాబోయేది ప్రజా ప్రభుత్వమే: నాగమాధవి


ప్రచారం చేస్తున్న లోకం నాగమాధవి

డెంకాడ: రాబోయేది ప్రజా ప్రభుత్వమేనని, రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబు ఎంత అవసరమని కూటమి నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని అమకాం, బొడ్డవలస, జొన్నాడ, ఆకులపేట గ్రామాల్లో ఆమె శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఆమెతో పాటు డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు, మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పల నారాయణ ఉన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా అధికారంలోకి రాగానే మండలంలో నెలకొన్న తాగునీటి సమస్యను, ప్రజా ఆరోగ్య సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాగితాల సత్యనారాయణరెడ్డి భవిరిశెట్టి శ్రీను, పసివాడ విద్యాసాగర్ నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: వైసీపీ పాలకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంటు కోఆర్డినేటర్ సువ్వాడ రవిశేఖర్ పిలుపునిచ్చారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి, ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడుకు మద్దతుగా టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్‌తో కలిసి ఆయన శుక్రవారం కొత్తపేట, సీతారామునిపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, గురాన అసిరినాయుడు, గురాన చక్ర ధర్, పోతల రాజప్పన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు: విజయనగరంలోని ఒంటితడి సబ్‌స్టేషన్ పరిధిలో పాత విద్యుత్ లైన్ల షిఫ్టింగ్, నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (ఆపరేషన్)హరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా విజయనగరం రూరల్ పరిధిలో గల ముడిదాం, సుంకరిపేట, చెల్లూరు, కోరాడపేట, చాకలిపేట, గుండాల పేట, గొల్లలపేట, వీటి అగ్రహారం, బీసీ కాలనీ, సంతోష్ నగర్, గణేష్ నగర్, వై జంక్షన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. కావున వినియోగ దారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

రేపు రేగిడిలో..

రేగిడి: ఉంగరాడమెట్ట విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా ఈనెల 5న రేగిడి మండల కేంద్రం ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నామని స్థానిక విద్యుత్ ఏఈ ఎల్ హరిబాబు శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు రేగిడి, ఆమదాలవలస గ్రామాలతో పాటు, మండల కాంప్లెక్స్‌లో ఉన్న అన్ని కార్యా లయాలు, ఇంకా రక్షితమంచి నీటిపథకాల ఫీడర్‌కు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కిసాన్ నేత మృతి తీరనిలోటు

రేగిడి: అఖిలభారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్‌కుమార్ అంజన్ శుక్రవారం లక్నోలో మృతిచెందటం అత్యంత విషాదకరమని, దేశ రైతులకు తీరనిలోటని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నారు జనార్దనరావు రైతుసంఘం తరపున తమ సంతాపం తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలో స్థానిక విలేఖర్లుతో మాట్లాడుతూ రైతు సమస్యలపై అతుల్‌కుమార్ మోడీసర్కార్‌ని ఎదురించి రైతు వ్యతిరేఖ చట్టాలను రద్దుచేయటంలో ముఖ్య పాత్ర పోషించారన్నారు.

6న రక్తదాన శిబిరం

చీపురుపల్లి: పట్టణంలోని ఆంజనేయపురంలో ఈనెల 6న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త బీవీ గోవిందరాజులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిఉన్న యువతీ యువకులు ఈ శిబిరంలో పాల్గొనవచ్చునని చెప్పారు. ఇతర వివరాల కోసం 8919264993 నెంబరుకు సంప్రదించాలన్నారు.

వడదెబ్బపై అవగాహన

దత్తిరాజేరు: కోరపుకొత్తవలస పంచాయతీ పరిధిలోని కె.కృష్ణాపురం, కోరప గ్రామంలో శుక్రవారం వడదెబ్బపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ డీవీ గిరిబాబు.. వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ప్రతిఒక్కరూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలోకి వెళ్లరాదన్నారు. అవసరమైన ఎండలోకి వెళ్లినా టోపీ పెట్టుకోవాలని, గొడుగులు పట్టుకోవాలని, తెల్లని దుస్తులు ధరించాలని చెప్పారు. పల్చని మజ్జిగ, గంజి, కొబ్బరినీళ్లు వంటివి తీసుకోవాలని సూచించారు. మాంసం, మద్యం వంటివాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో బి.మురళి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బేబీనాయనకు మద్దతుగా జనసేన సైకిల్ ర్యాలీ

బొబ్బిలి: ఎన్‌డీఏ కూటమి బొబ్బిలి ఎమ్మెల్యే విజయనగరం ఎంపీ అభ్యర్థులు బేబీనాయన, కలిశెట్టి అప్పలనాయుడుకు మద్దతుగా శుక్రవారం జనసేన రాష్ట్ర పార్టీ కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి పాలూరు బాబు ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వేణుగోపాల స్వామి కోవెల సెంటరు వద్ద ప్రారంభమై 5,7,8,9 వార్డుల్లో తిరుగుతూ సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ●స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ ఇన్ చార్జి గిరడ అప్పలస్వామి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేబీనాయన, కలిశెట్టి గెలుపు కోసం శ్రమించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

పశు సంపదపై దృష్టి పెట్టండి

సీతానగరం: పశు సంపదపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి ఎస్.మన్మథ రావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పశు వైద్య కేంద్రంలో సీతానగరం, బలిజిపేట మండలాల పశు వైద్యాధికారులు, పశువైద్య సచివాలయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. వేసవి దృష్ట్యా పశు సంపదపై రైతులు దృష్టి సారించేలా వారిని అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డా.ప్రసాదరావు, ఏడీలు డా.నీలయ్య, డా.చింతాడ దీనకుమార్, సీతానగరం, బలిజిపేట పశువైద్యు లు ఎస్.రామారావు, గణేష్, వివిధ సచివాలయ పశువైద్య సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆ కళ్లు సజీవం


సత్యవతి

రాజాం: పెనుబాక గ్రామంలో జడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు తల్లి బండి సత్యవతి శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. కుటుంబ సభ్యులు నేత్రదానం చేయాలని నిర్ణయించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి, నేత్రదాన సేకరణ కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అక్కడి నుంచి సిబ్బంది వచ్చి సత్యవతమ్మ నుండి కార్నియాలను సేకరించారు. ఆప్తాలమిక్ అధికారి చప్పటి వసంతరావు పెనుబాక ప్రజలకు నేత్రదానంపై అవగాహన కల్పించారు.

బేబీనాయన ఇంటింటి ప్రచారం


కొత్తపెంటలో బేబీనాయన ప్రచారం

బొబ్బిలి, మే 3: ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన బొబ్బిలి మండలం చిత్రకోట బొడ్డవలస, దిబ్బగుడ్డివలస, నారాయణప్పవలస, కాశిందొరవలస, గొర్లె సీతారాంపురం, కొత్తపెంట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట బీజేపీ నియోజకవర్గ కన్వీనరు మరిశర్ల రామారావునాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ, వెన్నెల నాగరాజు, కునుకు రమ, శివ, కృష్ణమూర్తి, ఎరుకునాయుడు, గొర్లె ఈశ్వరప్రసాద్, చోడవరపు సూర్యనారాయణ, పువ్వల మాధవ, బేతనపల్లి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు

తెర్లాం: ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం తమ్మయ్యవలస, రంగప్ప వలస, వెలగవలస, లోచర్ల, సోమిదవలస, పనుకువలస, డి. గదబవలస, గ్రామాల్లో బేబీనాయన ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో పాల్గొన్న ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి తమకు మద్దతు తెలపా లని కోరారు. తెలుగుదేశం పార్టీ ప్రవేశ పెట్టిన పథకాలు అభివృద్ధికి దిక్సూచిక లాంటివని, టీడీపీకి ఓటు వేయాలన్నారు. గ్రామ టీడీపీ నాయకులు, నర్సుపల్లి వెంకట నాయుడు, వెంకటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫెసిలిటేషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్


ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

గజపతినగరం: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఈవీఎం ఓటింగ్ యంత్రాల పని తీరును కలెక్టర్ వి.నాగలక్ష్మి పరిశీలించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసి పెసిలిటేషన్ కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 5 నుంచి 7వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు పోస్టల్ బ్యాలెట్లను వినియోగించుకోవాలని ఆమె సూచించారు. అలాగే ఓటింగ్ యంత్రాల్లో అభ్యర్థుల యంత్రాలను ఏవిధంగా పొందు పరుస్తున్నది అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు చోటు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగే విధంగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకుడు హనీష్ చోబ్రా, ఆర్వో సూర్యకళ, తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరేదీ: కళా


గుర్ల: తెట్టంగిలో మాట్లాడుతున్న కళా

గుర్ల: రైతులకు సాగునీరు ఇవ్వలేని చేతకాని సీఎంగా జగన్ రెడ్డి పేరు పొందారని కూటమి చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకటరావు అన్నారు. మండ లంలోని అచ్యుతాపురం, తెట్టంగి, పోలయ్యవలస, కెల్ల, కలవచర్ల గ్రామాల్లో ఆయన శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఉపాధి పనుల వద్దకు వెళ్లి, వారితో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు సాగునీరు అందించే విధంగా ఏర్పాట్లు చేస్తానన్నారు. టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్య దర్శి వి.సన్యాసినాయుడు, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ● **చీపురుపల్లి:** రావివలసలో పలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. కూటమి అభ్యర్థి కళావెంకటరావు వీరికి కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. ● **గరివిడి:** వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను, వర్గాలను నాశనం చేసిందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకటరావు అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాల యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గద్దె బా బూరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, కూటమి నాయకులు ఎస్‌వీఎల్ఎన్ రాజు, కోట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిల్ట్ తీత పనులు


సిల్ట్ పనులు చేపడుతున్న దృశ్యం

రాజాం: పురపాలక సంఘం పరిధిలోని తాగునీరు అందించే రక్షిత మంచినీటి పథకం సంబంధించి సోర్సు బావుల్లో సిల్ట్ తీత పనులు గత వారం రోజులుగా చేపడుతున్నారు. అన్నవరం నుంచి 14 మందిని తీసుకువచ్చి సుమారు 45 అడుగుల లోతున సిల్ట్ తీత పనులు చేస్తున్నారు. సుమారు 20 ఏళ్ల నుంచి ఇక్కడ సిల్ట్ తీత పనులు చేపట్టక పోవడంతో ఎప్పటికప్పుడు తాగునీరు కలుషితం కావడంతో పట్టణ ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసి కమిషనర్ నారప్పలనాయుడు, ఏఈ వెంకటయ్య చర్యలు తీసుకొని ఈ పనులను చేపడుతున్నారు. రెండు రోజుల్లో ప్రతి రోజూ సిల్ట్ పనులు పూర్తి చేయడానికి సుమారు రెండు లక్షలు వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. అంతే కాకుండా సోర్సు బావుల్లో చెక్కలు, కర్రలు ఉండటంతోను ఇసుక, మట్టి పూర్తిగా పూడికి పోవడంతో తాగునీటి ఇబ్బందులు కలుగుతున్నాయని, వాటిని కూడా తొలగించే చర్యలు చేపడుతున్నామన్నారు. అంతే కాకుండా రాజాంలో ఉన్న రక్షత మంచినీటి పథకం ట్యాంకులు నింపడానికి గతంలో మూడు పంపులు ఉండేవని, కానీ ప్రస్తుతం ఒక పంపు మరమ్మతులకు గురి కావడంతో రోజు తప్పించి రోజు తాగునీరు సరఫరా చేస్తున్నామని, ఆ పంపింగ్‌కు మరమ్మతులు చేయించడానికి బొబ్బిలి నుంచి మెకానిక్‌లను తీసుకువచ్చామని తెలిపారు. దాని మరమ్మతు పనులు కూడా పూర్తిచేస్తామన్నారు. ఈ పనులను కమిషనర్ నారప్పలనాయుడు శుక్రవారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేసి, ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాష్ట్ర భవిష్యత్తు మీ చేతుల్లోనే : అశోక్


మాట్లాడుతున్న అశోక్

విజయనగరం రూరల్: రాష్ట్ర భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని, న్యాయ నిర్ణేతలుగా ఆలోచించి మంచి చేసేవారికి ఈ నెల 13న ఓటెయ్యాలని టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు చెప్పారు. ఎన్నికల ప్రచార సభల్లో భాగంగా శుక్రవారం విజయనగరం మండల పరిధిలోని ముడిదాం, రీమాపేట గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచారసభల్లో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల కాలంలో అన్ని వ్యవస్థలను నాశనం చేశారని, అన్ని వర్గాలకు అన్యాయం చేశారన్నారు. సంక్షేమం ఎన్టీఆర్ హయాం నుంచే ప్రారంభమైందని, చంద్రబాబు కూడా సంపద సృష్టించి, సంక్షేమానికి నిదులు అధికంగా కేటాయించేవారన్నారు. జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచారన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికలు రాష్ట్రానికి దిశ, దశా నిర్దేశించేవన్నారు. అన్ని వర్గాల వారు ఆలోచించి ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, ముడిదాం, రీమాపేట టీడీపీ నాయకులు మజ్జి పైడితల్లి,ఎస్‌వీ నాగేశ్వరరావుతో పాటు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అండగా ఉంటా.. ఆదరించండి

జామి: ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే మీ ఇంటి ఆడబిడ్డగా మీకష్టసుఖాల్లో తోడుగా నిలుస్తానని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్ర వారం జామి సంతలో ప్రచారం చేశారు. కూరగాయల వ్యాపారులతో మమేకమై వారితో కలిసి కూరగాయలు అమ్మారు. హోటల్ నిర్వాహకులతో కలిసి వారి టిఫిన్ సెంటర్లో దోశలు వేశారు. టీడీపీ వస్తేనే రాష్ట్రానికి చక్కని భవిష్యత్తు ఉంటుందని అన్నారు. కూటమి అభ్యర్థికి ప్రజలు చక్కటి స్వాగతం పలికారు. ● **లక్కవరపుకోట:** లక్కవరపుకోట గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. శుక్రవారం టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి సమక్షంలో కండువాలు వే సుకున్నారు. పార్టీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు, సీనియర్ నాయకులు శ్రీనాథు పెదబాబు, కొట్యాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలిస్తేనే రాష్ట్రాభివృద్ధి

రామభద్రపురం: ఆంధ్రప్రదేశ్ అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించా ల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాలూరి బాబు, టీడీపీ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు విలేఖర్లతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని ఆరో పించారు. మళ్లీ రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే ఒక్క చంద్రబాబునాయుడుకే సాధ్యమన్నారు. వైసీపీ పాలనలో యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బొబ్బిలి అసెంబ్లీ అభ్యర్థి బేబీనాయన, పార్లమెంట్ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కలిసికట్టుగా పనిచేద్దాం

రాజాం: కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ విజయానికి కృషి చేద్దామని రాష్ట్ర తూర్పుకాపు సంక్షేమ సంఘం మాజీ చైర్మన్ కొళ్ల అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం నియోజకవర్గ మత్స్యకా రుల సం ఘం అధ్యక్షుడు బెహర తవుడు ఆధ్వర్యంలో మామిడిపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం కొళ్ల అప్పలనాయుడును మండల పార్టీ అధ్యక్షుడు గట్టి భాను, బొద్దూరు ఎంపీటీసీ సభ్యులు వల్లూరు గణేష్ కలిశారు.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు

దత్తిరాజేరు: టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని దాసరిపేట, గదబవలస, చామలాపల్లి, పెదమానాపురం గ్రామాల్లో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు చప్ప చంద్రశేఖర్, బెజవాడ రాజేశ్వరి, పెద్దింటి మోహన్ తదితరులు పాల్గొన్నారు. ●**భోగాపురం:** పూసపాటిరేగ మండలం కనిమెళ్ల పంచాయతీ కామవరం గ్రామానికి చెందిన పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శుక్రవారం పోలిపల్లి గ్రామంలో టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో వీరంతా తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో దంతులూరి సూర్యనారా యణరాజు, అప్పలస్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

● **డెంకాడ:** జొన్నాడ గ్రామానికి చెందిన సుమారు 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. శుక్రవారం జొన్నాడ గ్రామంలో మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు సమక్షంలో మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణ, టీడీపీ మండ ల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు. పార్టీ నాయకులు కాగితాల సత్యనారాయణ, రెడ్డి పతివాడ విద్యాసాగర్‌నాయుడు, సారిక నాగరాజు, బవిరిశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ: నగర పంచాయతీలోని ఏడో వార్డు నాలుగో లైన్ నివాస ప్రజలు వి ద్యుత్ సమస్యలతో సతమతమవుతున్నారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాత్రి పది గంటల తర్వాత విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరించిన నాయకులు

బొబ్బిలి: అఖిలభారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) 65 వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని ఆ సంఘం డివిజన్ కార్యదర్శి ఎస్.గణపతి ఆధ్వర్యంలో స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో శుక్రవారం జరుపుకున్నారు. జిల్లా సీపీఐ కార్య దర్శి ఒమ్మి రమణ సంస్థ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, అల్లూరి సీతారామరాజు, చేగువేరా వంటి యువజన విప్లవకారుల స్ఫూర్తితో ఏఐవైఎఫ్ వీరోచితంగా పోరాడుతోందని అన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్యలతో పాటు అనేక సమస్యలు పెచ్చుమీరిపోతు న్నాయన్నారు. పాలకుల దుర్నీతి విధానాలే ఇందుకు కారణమని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం లేనిపోని హామీలు ఇస్తూ వాటిని అమలు చేయ కుండా తాత్సారం చేస్తున్నారన్నారు. విశాఖ స్టీల్‌ను ప్రైవేట్ పరం చేసేందుకు కేం ద్రం కుట్ర పన్నుతుంటే జగన్ చోద్యం చూస్తున్నారని ఎద్దేవా చేశారు. మెగా డీఎస్సీ లేకుండా దగా డీఎస్సీ తెచ్చారని, జాబ్‌క్యాలెండరు ఊసేలేదన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు నివార్యమవుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్ నాయకులు మునకాల శ్రీనివాస్, కోట అప్పన్న, మహేశ్, చిన్న, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

జామి: మండలంలోని రామయ్యపాలెం మామిడితోట వద్ద అక్రమంగా తరలిస్తున్న 40 మద్యం బాటిళ్ల ను స్వాధీనం చేసుకుని వీటిని తరలిస్తున్న వ్యక్తిని జామి పోలీసులకు అప్పగించినట్లు ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి లక్ష్మి తెలిపారు. స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం దాడులు నిర్వహించగా, తాండ్రంగి గ్రామానికి చెందిన కొత్తలి ప్రకాశ్ వద్ద ఈ బాటిళ్లు గుర్తించామన్నారు. వీటిని జామి ఎస్ఐ సమక్షంలో అప్పగించామన్నారు.

శృంగవరపుకోట రూరల్/జామి: మండలంలోని గోపాలపల్లి, జామి మండలం భీమసింగి వద్ద నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ జీ ఫణీంద్రబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎస్.కోట మండలం గోపాలపల్లి వద్ద 12 మద్యం బాటిళ్లు, భీమసింగి వద్ద 49 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు.

తైక్వాండో సెమినార్ ప్రారంభం


రాజీవ్ క్రీడామైదానంలో జాతీయ తైక్వాండో రిఫరీ రిఫ్రెషర్ సెమినార్ దృశ్యం

విజయనగరం దాసన్నపేట, మే 3: విజయనగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో జాతీయ తైక్వాండో రిఫరీ రిఫ్రెషర్ సెమినార్ శుక్రవారం ప్రారంభమైంది. తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి క్రీడాకారులు, కోచ్‌లు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమం శనివారం కూడా కొనసాగనుంది.

హత్యాయత్నం కేసు నమోదు

మక్కువ: ఓ యువకుడిపై దాడిచేసి, పరారైన ముగ్గురు వ్యక్తులను స్థానిక పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఈ మేరకు వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.నరసింహమూర్తి శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మక్కువ మండల కేంద్రంలోని కూరాకుల వీధికి చెందిన కోట రామకృష్ణపై ఈనెల 1న బుధవారం కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన రామకృష్ణ స్థానిక పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఈక్రమంలో రామకృష్ణపై దాడి చేసిన మక్కువకు చెందిన బర్రి హరి, బర్రి లక్ష్మణరావు, పువ్వల సూర్యనారాయణలను శుక్రవారం స్థానిక చర్చి సెంటర్ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. వారిని 307 సెక్షన్ కింద అరెస్టు చేసి, సాలూరు జ్యుడీషియల్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం బొబ్బిలి సబ్‌జైలుకు తరలించారు.